క్లుప్తంగా

హనుమాన్ ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన



ఆలయ నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న దొడ్డి కిరణ్

గోపాలపట్నం: జీవీఎంసీ 89వ వార్డు కొత్తపాలెం గణపతినగర్‌లో హనుమాన్ ఆలయం నిర్మాణానికి హనుమాన్ జయంతి సందర్భంగా వైఎస్సార్ సీపీ జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు, డీపీ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు దొడ్డి కిరణ్ శంకుస్థాపన చేశారు. ఆలయ నిర్మాణం కోసం జరిగిన ఈ పూజలో పాల్గొనడం సంతోషంగా ఉందని ఆయన తెలిపారు. ఈ నిర్మాణానికి తన వంతు సహకారాన్ని అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కర్రి గౌరి, శ్రీనివాసరావు, పి. మహలక్ష్మినాయుడు, దొడ్డి జగ్గారావు తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాల ఏర్పాటు



శ్రీహరిపురం వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రారంభించిన గణబాబు,కోరాడ శ్రీను

మల్కాపురం: వేసవి తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో పారిశ్రామిక ప్రాంతంలోని పలు చోట్ల సేవా ట్రస్టుల ప్రతినిధులు చలివేంద్రాలు ఏర్పాటు చేస్తున్నారు. ఇందులో భాగంగా 58వ వార్డు శ్రీహరిపురం వద్ద శ్రీదేవి చారిటబుల్ ట్రస్ట్ అధినేత కోరాడ శ్రీను ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా పలువురు పాదచారులకు, వాహనదారులకు గణబాబుతో కలిసి కోరాడ శ్రీను మజ్జిగ పంపిణీ చేశారు. అలాగే 60వ వార్డు గుల్లలపాలెం వుడా కాలనీ వద్ద మహాత్మాగాంధీ షాపింగ్ కాంప్లెక్స్ ఆవరణలో గల సాయిబాబా సేవా ట్రస్ట్ ప్రతినిధులు గుల్లలపాలెం సేవా మార్గం వద్ద మజ్జిగ, మంచినీరు పంపిణీ చేసే కార్యక్రమం చేపట్టారు.

తూర్పు నావికాదళాన్ని సందర్శించిన విద్యార్థులు



ఐఎన్ఎస్ రణవీర్‌ను సందర్శిస్తున్న విద్యార్థులు

సింధియా: ఒడిశాలోని భువనేశ్వర్‌లోని సైనిక్ స్కూల్ , ఛత్తీస్‌గఢ్‌లోని రాజనందన్‌గావ్‌లోని సైనిక్ స్కూల్‌కు చెందిన విద్యార్థులు శనివారం తూర్పు నావికాదళానికి చెందిన యుద్ధ నౌకలు ఐఎన్ఎస్ రణవీర్, ఐఎన్ఎస్ సయాద్రిని సందర్శించారు. ఈ సందర్భంగా సిబ్బంది విద్యార్థులకు ఇండియన్ నేవీలోని వివిధ విభాగాలు , నావికాదళం ప్రాముఖ్యత గురించి వివరించారు. పర్యటనకు వచ్చిన విద్యార్థుల బృందం గొప్ప ఆవిష్కరణలు, సృజనాత్మకత, పురోగతితో సమాజానికి, దేశానికి మార్పు తీసుకురాగలదని భావిస్తున్నట్లు నేవీ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి



మృతుడు అప్పలరాజు (ఫైల్‌ఫోటో)

గోపాలపట్నం: యువకుల దాడిలో గాయపడిన ఇసరపు అప్పలరాజు (68) కేజీహెచ్‌లో చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. ఈ నెల 7న ఉదయం గాయత్రి కళాశాల ఎదురుగా ఓ సెల్లార్‌లో మద్యం సేవిస్తుండగా వద్దని చెప్పినందుకు యువకులు దాడి చేసిన విషయం తెలిసిందే. ఈ దాడిలో తీవ్రంగా గాయపడటంతో పోలీసులు ఆయనను కేజీహెచ్‌కు తరలించారు. అప్పలరాజుకు భార్య, కుమార్తె, కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించారు. అయితే, కళాశాల యాజమాన్యం, సెక్యూరిటీ కాంట్రాక్టర్ ఈ ఘటనతో తమకు ఎటువంటి సంబంధం లేదని చెప్పడంతో కుటుంబ సభ్యులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కళాశాల ప్రాంగణంలోనే సంఘటన జరిగినా, తమకు సంబంధం లేదని అనడం చాలా దారుణమని వారు వాపోయారు. కళాశాల యాజమాన్యం తమకు న్యాయం చేయాలని వారు కోరుతున్నారు.

ముంపు ముప్పు తప్పదా..!



విమాన్ నగర్ వద్ద డ్రైనేజీలో విరిగిపడిన చెట్టును తొలగించిన దృశ్యం



గురజాడ నగర్‌లో డ్రైనేజీల ఆక్రమణ





ఎన్ఏడీ ప్లై ఓవర్ వద్ద కాలువను ఆక్రమించి నిర్మాణం

విశాఖ విద్య: డ్రైనేజీల నిర్వహణలో జీవీఎంసీ అధికారులు అలసత్వం వహిస్తున్నారు. మేజర్ డ్రైనేజీల వైపు కన్నెత్తి చూడడం లేదు. డ్రైనేజీలు, కాలువల్లో పూడికలను సకాలంలో తీయకపోవడంతో చెత్తాచెదారం పేరుకుపోయి దిగువకు మురుగునీరు పారడం లేదు. దీంతో డ్రైనేజీలో మురుగు నిలిచిపోయి దుర్వాసన వెదజల్లుతోంది. మూడు రోజుల కిందట కురిసిన వర్షానికి పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు పొంగి ప్రవహించాయి. కొన్ని చోట్ల మురుగునీరు రోడ్లపైకి రావడంతో వాహనాల రాకపోకలకు ఆటంకం ఏర్పడింది. చిన్నపాటి వర్షానికే ఇలా జరిగితే, భారీ వర్షం పడితే పరిస్థితి ఎలా ఉంటుందోనని ప్రజానీకం భయపడుతున్నారు.

మేజర్ డ్రైనేజీల నిర్వహణపై నిర్లక్ష్యం

జోన్ -8 పరిధిలోకి వచ్చే 89,90,91 వార్డుల పరిధిలోని కాలనీలకు అనుసంధానంగా మేజర్ డ్రైనేజీ వ్యవస్థ ఉంది. ఆయా వార్డుల పరిధిలోని మురుగునీరు దిగువన గల రైల్వే ట్రాక్‌కు ఆనుకొని ఉన్న కాలువ ద్వారా కిందకు వెళ్తోంది. అదే విధంగా విమాన్‌నగర్‌లోని మేజర్ డ్రైన్ నుంచి విమానాశ్రయం వైపు మురుగు నీరు పంపించేలా ఏర్పాట్లు చేశారు. కానీ ఆయా డ్రైనేజీలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయడం లేదని కాలనీ వాసులు అంటున్నారు. విమాన్ నగర్ వద్ద జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న తూముల వద్ద చెత్త అడ్డంగా ఉండడంతో మురుగు నీరు నిలిచిపోతుంది.



జీవీఎంసీ 52వ వార్డు గురజాడ నగర్‌లో డ్రైనేజీలో పేరుకుపోయిన చెత్త

మేల్కొనపోతే ముప్పే

డ్రైనేజీల శుభ్రత, మరమ్మతులకు ఇదే సమయం. జీవీఎంసీ 5వ జోన్, 8వ జోన్ పరిధిలో డ్రైనేజీ కారణంగా ముంపునకు గురయ్యే శివారు ప్రాంతాలను ముందుగానే గుర్తించి నివారణ చర్యలు చేపట్టాల్సిన అవసరం ఎంతైనా ఉంది. బుచ్చిరాజుపాలెం, ఏపీఎస్ఈబీ కాలనీ,గవరవీధి తదితర కాలనీ నుంచి దిగవకు పారే మురుగునీరు రైల్వే ట్రాక్ నుంచి కిందకు పోయే మార్గం తరచూ మూసుకుపోతుంది. ఇటీవల ఈ ప్రాంతాన్ని స్థానిక ఎమ్మెల్యే గణబాబు జీవీఎంసీ అధికారులతో కలసి పరిశీలించారు. డ్రైనేజీ వ్యవస్థను ఇక్కడ పటిష్టం చేసేలా ప్రణాళికలను తయారు చేయాలని సూచించారు. కానీ, అది ఎప్పట్లోగా కార్యరూపంలోకి వస్తుందో ననేది ప్రశ్నార్థకం.

ఆక్రమణలపై చర్యలేవి?

జీవీఎసీ 52,90వ వార్డుల్లో పలుచోట్ల డ్రైనేజీలను ఆక్రమించి నిర్మాణాలు చేయడంతో మురుగునీరు దిగువకు వెళ్లే పరిస్థితి లేకుండా పోతుంది. 52వ వార్డు ఫ్లై ఓవర్ సమీపంలోని గురజాడ నగర్‌లో డ్రైనేజీని పూర్తిగా మూసేసి కొంతమంది వ్యాపారాలు చేసుకుంటున్నారు. దీంతో చిన్న పాటి వర్షం కురిసినా, మురుగునీరు దిగువకు పోయేమార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉంటుందని పరిసర ఇళ్ల వారు వాపోతున్నారు. కాలువలను ఆక్రమిస్తున్న వారిపై జీవీఎంసీ అధికారులు ఉదాసీనంగా వ్యవహరిస్తుండడంతోనే ఇలాంటి సమస్య ఉత్పన్నమవుతుందని ప్రజానీకం అంటున్నారు.

నేత్రపర్వంగా సుబ్రహ్మణ్య స్వామి రథోత్సవం



ప్రత్యేక అలంకరణలో సుబ్రహ్మణ్య స్వామి

కంచరపాలెం: ఊర్వశి జంక్షన్ రవీంద్రనగర్‌లోని సుబ్రహ్మణ్య స్వామి ఏకాంత ఆలయంలో శనివారం చైత్రమాస బహుళ పూర్ణిమ మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. కార్తికేయ శరవణ ట్రస్టు ఆలయ ధర్మకర్త దేవాలరాజు(కృష్ణ) ఆధ్వర్యంలో, ప్రధాన అర్చకుడు రామకృష్ణ శర్మ నేతృత్వంలో స్వామికి విశేష పూజా కార్యక్రమాలు చేపట్టారు. అష్టోత్తర శత కలశాభిషేకం, సహస్ర నామ విభూది పుష్పాలతో అర్చనలు చేశారు. మాలధారులు శూలాలు వేసుకుని వేళ్‌వేళ్ మురుగన్ అంటూ రథోత్సవం నిర్వహించారు. సాయంత్రం ఊర్వశి కూడలి నుంచి జాతీయ రహదారిలో ప్రారంభమై కంచరపాలెం ఫ్లైఓవర్ వంతెన మీదుగా మహా రథోత్సవం నేత్రపర్వంగా సాగింది. మధ్యాహ్నం ఆలయ ఆవరణలో భక్తులకు ప్రసాద వితరణ చేశారు. సాయంత్రం జాతరలో నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ఉత్సవ కమిటీ సభ్యులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

డంపర్ బిన్‌లో చెత్తకు నిప్పు

ఫోకస్



ఆర్పీపేట పాఠశాల వద్ద డంపర్ బిన్‌లో వ్యాపించిన పొగ

కంచరపాలెం: జీవీఎంసీ 56వ వార్డు పరిధిలోని కంచరపాలెం రామ్మూర్తిపంతులుపేట ఉన్నత పాఠశాల, కంచరపాలెం ప్రాథమిక పాఠశాల, ఆర్పీపేట ప్రాథమిక పాఠశాల, కంచరపాలెం అంగన్‌వాడీ కేంద్రం ప్రధాన గేటు వద్ద జీవీఎంసీ పబ్లిక్ హెల్త్‌కు సంబంధించిన డంపర్ బిన్‌ను ఏర్పాటు చేయడంతో పరిసరాలు దుర్గంధభరితంగా మారాయి. పాఠశాల వ్యర్థాలను కూడా ఈ బిన్‌లోనే వేస్తుండటంతో పరిస్థితి మరింత దారుణ ఉంది. ఈ సమస్యపై ఈ నెల 11న సాక్షి దినపత్రికలో 'డంపర్ బిన్‌తో దుర్గంధం' అనే కథనం వెలువడింది. అయితే, శానిటరీ అధికారులు స్పందించకపోవడంతో విసిగిపోయిన స్థానికులు శనివారం డంపర్ బిన్‌లో ఉన్న చెత్తకు నిప్పు పెట్టారు. మంటలను ఆర్పడానికి స్థానిక దుకాణదారులు నీళ్లు చల్లడంతో అవి అదుపులోకి వచ్చాయి. కానీ, ఆ ప్రాంతమంతా పొగతో కమ్ముకుంది. ఈ సమస్యపై సంబంధిత జోన్-5 పబ్లిక్ హెల్త్ అధికారులు తక్షణమే స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

సిరులతల్లికి తులసిపూజ



తులసిపూజలో సిరులతల్లి

దాబాగార్డెన్స్: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి దేవస్థానంలో శనివారం తులసి పూజ నిర్వహించారు. ఉదయం 7 గంటల నుంచి 8 గంటల వరకు జరిగిన ఈ పూజలో పలువురు ఉభయదాతలు పాల్గొన్నారు. అమ్మవారి త్రికాల పంచామృతాభిషేక సేవలో కూడా పలువురు భక్తులు పాల్గొన్నారు. తులసీదళార్చనలో పాల్గొనదలచిన భక్తులు రూ1,500, త్రికాల పంచామృతాభిషేక సేవలో పాల్గొనే భక్తులు రూ1,000 పూజా రుసుము చెల్లించి పాల్గొనవచ్చునని ఆలయ కార్యనిర్వహణాధికారి కె. శోభారాణి తెలిపారు. ప్రత్యేక పూజను పరోక్ష పద్ధతిలో చేసుకోవాలనుకునే భక్తులు యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా టౌన్‌కొత్తరోడ్డు శాఖ ద్వారా నగదు చెల్లించవచ్చు.

జై శ్రీరామ్.. జై హనుమాన్



హనుమాన్ ర్యాలీలో పాల్గొన్న గణబాబు



శోభాయాత్రలో పాల్గొన్న బీజేపీ నాయకులు

మల్కాపురం: హనుమాన్ జయంతి సందర్భంగా శనివారం నిర్వహించిన హనుమాన్ శోభాయాత్రను 59వ వార్డు జింక్ ఆంజనేయస్వామి ఆలయం బీజేపీ నాయకులు కలిదిండి బద్రీనాథ్, పొలిమేర శ్రీను ప్రారంభించారు.జై శ్రీరామ్ అంటూ జింక్ ఆంజనేయస్వామి ఆలయం నుంచి గాజువాక మీదుగా నగరం వరకు వారు శోభాయాత్ర చేపట్టారు. కార్యక్రమంలో నాయకులు సంతోష్,సోమాదుల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

విజయోత్సవ బైక్ ర్యాలీ

గోపాలపట్నం: హనుమాన్ జయంతి సందర్భంగా గోపాలపట్నం నుంచి బీజేపీ నాయకులు విజయోత్సవ బైక్ ర్యాలీ నిర్వహించారు. గోపాలపట్నం నుంచి ఎన్ఏడీ జంక్షన్ మీదుగా బీచ్ రోడ్డు వరకు కొనసాగింది. ఈ ర్యాలీ వల్ల బీఆర్టీఎస్ రహదారి కాషాయ రంగు జెండాలతో శోభాయమానంగా మారింది. గోపాలపట్నం సీఎంఆర్ షాపింగ్ మాల్ సమీపంలో ఎమ్మెల్యే గణబాబు ఈ ర్యాలీకి స్వాగతం పలికారు. ఇక్కడ ఆయన జెండా ఊపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు దాడి పురుషోత్తమ రమేష్, బాలరాజేశ్వరరావు, కాళ్ల అశోక్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో మెరిసిన పేదింటి కుసుమం

విశాఖ విద్య: ఎన్ఏడీ బుచ్చిరాజుపాలెంకు చెందిన దొడ్డి అమృత లక్ష్మి గౌరీ ఇంటర్మీడియట్ ఫలితాల్లో అత్యుత్తమ మార్కులు సాధించింది. ఇంటర్ సెకండ్ ఇయర్ ఎంపీసీ కోర్సులో ఆమె 985 మార్కులు సాధించడంతో తల్లిదండ్రులు ఎంతో సంతోషం వ్యక్తం చేశారు. శనివారం విడుదలైన ఫలితాల్లో కుమార్తె సాధించిన మార్కులను చూసి వారి ఆనందానికి అవధులు లేవు. వారు తమ కుమార్తెకు స్వీటు తినిపించి అభినందించారు. అమృత లక్ష్మి గౌరి తండ్రి సతీష్ వాటర్ వర్క్స్ విభాగంలో పనిచేస్తుండగా, తల్లి గృహిణి. ఆమె స్థానికంగా ఉన్న ఒక ప్రైవేటు కళాశాలలో ఇంటర్మీడియట్ చదివింది. మంచి మార్కులు సాధించిన అమృత లక్ష్మి గౌరిని పలువురు అభినందించారు.

ఎన్ఏడీ చైతన్య విద్యార్థుల విజయకేతనం



విద్యార్థులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

విశాఖ విద్య: ఇంటర్మీడియట్ ఫలితాల్లో శ్రీ చైతన్య ఎన్ఏడీ జోన్ విద్యార్థులు ప్రతిభ చూపారని ఏజీఎం కేవీ రమణ తెలిపారు. సీనియర్ ఇంటర్ ఫలితాల్లో ఎంపీసీ విభాగంలో ఎస్. మనస్విని, మేఘన శర్మ లు 991 మార్కులు సాధించారని తెలిపారు. అదే విధంగా బైపీసీ విభాగంలో 989 మార్కులతో కె. ప్రవల్లిక టాపర్‌గా నిలిచారని చెప్పారు. 980 అంతకన్నా ఎక్కువ మార్కులను 40 మంది సాధించారని పేర్కొన్నారు. అదేవిధంగా ప్రథమ సంవత్సరం ఎంపీసీ విభాగంలో ఎస్. ఆశ్రిత, తుపురాని లహరి, మల్లపురెడ్డి ఆదిత్య సుహాస్ 465 మార్కులు సాధించారని చెప్పారు. టాపర్లను ఎగ్జిక్యూటివ్ ఏజీఎం కె.వి రమణ ,ఎగ్జిక్యూటివ్ డీన్ రఘు కుమార్ , ఏజీఎం శ్రీనివాస్ రావు , డీన్ శ్రీనివాస్ , జోనల్ ప్రిన్సిపాల్ దిలీప్ కుమార్ అభినందించారు.

లేబర్ కోడ్స్ రద్దు చేయాలి



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఐటీయూ రాష్ట్రప్రధాన కార్యదర్శి సీహెచ్ నరసింగరావు

మహారాణిపేట: కార్మికులను బానిసలుగా చేసే లేబర్ కోడ్స్‌ను తక్షణమే రద్దు చేయాలని కోరుతూ అఖిల పక్ష కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో మే 20వ తేదీన అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని సీఐటీయూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్. నర్సింగరావు పిలుపునిచ్చారు. జగదాంబ వద్ద గల సీఐటీయూ ఆఫీసులో లేబర్ కోడ్స్ రద్దు చేయాలని, మే 20 అఖిల భారత సమ్మెను జయప్రదం చేయాలని వేసిన పుస్తకాన్ని ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నరేంద్ర మోదీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు అనుకూలంగా వ్యవహరిస్తుందన్నారు. వారి లాభాల కోసమే ప్రభుత్వ రంగాన్ని ప్రైవేటీకరణ చేస్తుందన్నారు. బ్రిటిష్ కాలం నుంచి పోరాడి సాధించుకున్నటువంటి 44 కార్మిక చట్టాలలో 29 చట్టాలను 4 లేబర్ కోడ్స్‌గా మార్పు చేయడం దుర్మార్గమన్నారు. ఈ కోడ్స్ అమలు జరిగితే కార్మికులు బానిసలుగా మారతారన్నారు. లేబర్ కోడ్స్‌ను రద్దు చేయాలని కోరుతూ మే 20న సమ్మెకు పిలుపునిచ్చామన్నారు. ఈ సమ్మెను విజయవంతం చేయడం ద్వారా మోదీ అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు అడ్డుకట్ట వేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు కేఎం శ్రీనివాసరావు, ఆర్‌కేఎస్‌వీ కుమార్, కోశాధికారి జ్యోతీశ్వరరావు, జిల్లా కార్యదర్శులు బి.జగన్, జి. అప్పలరాజు, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కో కన్వీనర్ కుమార మంగళం తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థుల ప్రతిభ



ప్రజ్ఞా ప్రీతి 976/1000



ప్రియాంక పాండే 976/1000

మల్కాపురం: ఇంటర్ ఫలితాలలో మల్కాపురం సెయింట్ ఆన్స్ మహిళా కళాశాల విద్యార్థినులు ప్రతిభ కనబరిచారు. కళాశాలలో చదువుతున్న ప్రియాంక పాండే(ఎంపీసీ) 1000 మార్కులకు గాను 976 మార్కులు సాధించి ఎంపీసీలో ప్రథమ స్థానంలో నిలిచారు. అలాగే ఇదే కళాశాలలో బైపీసీ చదువుతున్న ప్రజ్ఞా ప్రీతి 1000 మార్కులకు గాను 976 మార్కులు సాధించారు. సీఈసీ గ్రూప్‌లో రేణుక 1000 మార్కులకు గాను 937 మార్కులు సాధించారు. అలాగే ఎంపీహెచ్‌డబ్ల్యూలో ఎల్.కీర్తి 1000 మార్కులకు 968 మార్కులు సాధించారు. సీఎస్‌సీ గ్రూప్‌లో రూపా తనూజ 1000 మార్కులకు 976 మార్కులు సాధించారు. ఎంఎల్టీ గ్రూప్‌లో పి.యోగిత 1000 మార్కులకు గాను 958 మార్కులు సాధించారు. ఈ కళాశాలలో 81 శాతం ఉత్తీర్ణత సాధించడంతో కళాశాల ప్రిన్సిపల్ కేస్లిన్, కరస్పాండెంట్ గెసిల్లా, డిగ్రీ కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ప్రేమకుమారి తదితరులు విద్యార్థినులను అభినందించారు.

మెరిసిన విద్యాకుసుమాలు

గోపాలపట్నం: ఇంటర్ పరీక్షల్లో గోపాలపట్నం జిల్లా పరిషత్ బాలికల ఉన్నత ప్లస్-2 పాఠశాల విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచారు. ఎంపీసీ రెండో సంవత్సరంలో ఎస్. ఆకర్షిక 922 మార్కులు సాధించింది. అలాగే బైపీసీలో కాపు సాయిలక్ష్మి 907 మార్కులు సాధించి అందరి మన్ననలు అందుకున్నారు. జూనియర్ ఇంటర్‌లో కూడా మంచి మార్కులు సాధించారు. బైపీసీలో 412 మార్కులు సాధించగా, ఎంపీసీలో టి. మౌనిక 335 మార్కులు సాధించింది. ఈ స్కూల్‌లో మొదటి ఏడాది విద్యార్థులు బైపీసీలో 19 మందికి 5 పాస్ కాగా ఎంపీసీలో 24 మందికి ఆరుగురు ఉత్తీర్ణులయ్యారు. అయితే రెండో సంవత్సరంలో బైపీసీ 22 మందికి 12 మంది, ఎంపీసీలో 15 మందికి 8 మంది ఉత్తీర్ణులు కాగా 50 శాతం ఉత్తీర్ణత సాధించామని ప్రధానోపాధ్యాయుడు ప్రసాద్ తెలిపారు.

రెసిడెన్షియల్ కళాశాలలో..

మేహాద్రి గెడ్డ రెసిడెన్షియల్ కళాశాలలో ఎంపీసీ, బైపీసీలో 59 మంది విద్యార్థులు పరీక్షలు రాయగా 34 మంది ఉత్తీర్ణులయ్యారు. అలాగే రెండో ఏడాదిలో 53 మంది పరీక్షలు రాయగా 42 మంది పాసయ్యారు. రెండో ఏడాది బైపీసీలో ఎస్. ప్రమీల 955 మార్కులు, ఎస్. దుర్గ 939 మార్కులు సాధించింది. మొదటి సంవత్సరం ఎంపీసీలో 411మార్కులు జయలలిత సాధించగా బైపీసీలో డి. రుచిత 422 మార్కులు సాధించింది.

ఐఏఎస్ అధికారి అవుతా



ఐఏఎస్ కావాలని ప్రణాళిక చేసుకుంటున్నాను. స్కూల్‌లో అధ్యాపకులు సహకారంతోనే 922 మార్కులు సాధించాను. నా తండ్రి పాస్టర్.. వారి కళ్లల్లో ఆనందం కోసం కష్టపడుతున్నాను. డిగ్రీలో బీఏలో చేరుతాను. ప్రణాళికా బద్ధంగా చదువుతాను.

-ఎస్. ఆకర్షిక, గోపాలపట్నం

టార్గెట్ డాక్టర్



మాది కె. కోటపాడు మండలం రామయోగి అగ్రహారం. గోపాలపట్నంలో పిన్ని ఇంటి దగ్గర ఉండి చదువుతున్నాను.907 మార్కులు వచ్చాయి. డాక్టర్ కావాలని నా లక్ష్యం. మా నాన్న రాంబాబు టైలరింగ్ చేస్తూ పోషిస్తున్నాడు. ఆయనకు భారం కాకుండా డాక్టర్ అవుతాను. పిన్ని ద్వారా ఇక్కడ ప్రభుత్వ పాఠశాలలో ఇంటర్ కోర్సులు ప్రారంభమయ్యాయని తెలిసి ఇక్కడ చేరాను. అధ్యాపకులు, వాతావరణం చాలా బాగుంది.

-కాపు సాయిలక్ష్మి, రామయోగి అగ్రహారం

మత్స్యకారుడికి జాక్‌పాట్

- వలకు చిక్కిన నల్ల చందువాలు



హార్బర్‌లో వలకు చిక్కిన నల్ల చందువాలు

మహారాణిపేట: విశాఖ ఫిషింగ్ హార్బర్‌లో శనివారం సందడి నెలకొంది. వేటకు వెళ్లిన మత్స్యకారుల వలలకు ఊహించని సంఖ్యలో నల్ల చందువాలు చిక్కాయి. మార్కెట్‌లో మంచి డిమాండ్, అధిక ధర పలికే ఈ చేపలు ఒకేసారి పెద్ద మొత్తంలో లభించడంతో మత్స్యకారుడు మూగి రాముడు ఆనందం వ్యక్తం చేశారు.

చందనోత్సవానికి బస్సులన్నీ కండిషన్‌లో ఉండాలి

ఆర్టీసీ ఆర్ఎం అప్పలనాయుడు



మెకానికల్ సిబ్బందికి సూచనలు ఇస్తున్న అప్పలనాయుడు

సింహాచలం: ఈ నెల 30న జరిగే శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో నుంచి తిరిగే బస్సులన్నీ కండీషన్‌లో ఉండేలా చూడాలని ఆర్టీసీ విశాఖ రీజినల్ మేనేజర్ అప్పలనాయుడు అధికారులను ఆదేశించారు. సింహాచలం డిపోను శనివారం సందర్శించిన ఆయన మాట్లాడుతూ చందనోత్సవాన్ని పురస్కరించుకుని సింహాచలం డిపో 51బస్సులను నడుపుతుందని తెలిపారు. వీటిలో 35బస్సులు కొండదిగువ గోశాల నుంచి సింహగిరిపైకి, పది బస్సులు పాత అడవివరం నుంచి కొత్త టోల్‌గేట్ మీదుగా తిరుగుతాయన్నారు. ఆరు బస్సులు శ్రీనివాసనగర్ నుంచి అడవివరం వరకు తిరుగుతాయని తెలిపారు. దేవస్థానం ముందుగా ఆ బస్సులకు నగదు చెల్లిస్తుండటంతో ఉచిత ప్రయాణమే భక్తులకు ఉంటుందని తెలిపారు. ప్రయాణికులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ముందస్తుగా బస్సులను కండిషన్‌లో ఉంచాలని మెకానికల్ సిబ్బందిని ఆదేశించారు. ఫిట్‌నెస్ సర్టిఫై చేయాలని సూచించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ రాజశేఖర్, అసిస్టెంట్ ఇంజినీర్లు నాయుడు, కొండలరావు, సేఫ్టీ డ్రైవింగ్ ఇన్‌స్పెక్టర్లు ఎం.ఎస్.రావు, ఇక్బాల్, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు పర్యాటకులను కాపాడిన లైఫ్‌గార్డ్స్



కాపాడిన పర్యాటకులతో లైఫ్‌గార్డ్స్

కొమ్మాది: రుషికొండ బీచ్‌లో కొట్టుకుపోతున్న ఇద్దరు పర్యాటకులను లైఫ్‌గార్డ్స్ కాపాడారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రం రాయపూర్‌కు చెందిన ఆరుగురు పర్యాటకులు శనివారం మధ్యాహ్నం రుషికొండ బీచ్ వచ్చారు. స్నానం చేసేందుకు సముద్రంలోకి దిగారు. ఈ క్రమంలో అలల ఉధృతి ఎక్కువగా ఉండటంతో ఆయుష్ ఠాకూర్, సత్యం ఠాకూర్ కొట్టుకుపోతుండగా అక్కడ విధులు నిర్వహిస్తున్న లైఫ్‌గార్డ్స్ వీరిని గమనించి సురక్షితంగా ఒడ్డుకు చేర్చారు. పర్యాటకులను సురక్షితంగా కాపాడిన లైఫ్‌గార్డ్స్‌ను మెరైన్ సీఐ శ్రీనివాసరావు అభినందించారు.